## క్లుప్తంగా

### నేడు వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

కవిటి: రాజపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కపాసుకుద్ది రూరల్ అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో ఆర్.భైరిపురం, జల్లుపుట్టుగ, ముత్యాలపేట, డిజిపుట్టుగ, నెలవంక తదితర గ్రామాలకు బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇంజినీర్ ఎం.నేతాజీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్.భైరిపురంలో ఆర్‌డబ్ల్యూఎస్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నందున సరఫరాను నిలిపి వేస్తున్నామని.. వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

### నేత్రపర్వంగా మంగళగౌరీవ్రతాలు



లోళ్లపుట్టుగలో సామూహిక మంగళగౌరీ వ్రతాల్లో భక్తులు

కవిటి: లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, ప్రగడపుట్టుగ శివాలయంలో మంగళవారం శ్రావణ మాసం సందర్భంగా మంగళగౌరీవ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లోళ్లపుట్టుగలో ప్రధానార్చకుడు అప్పలస్వామి ఆధ్వర్యంలో జరిగిన వ్రతాల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఆలయ కమిటీ వితరణ చేసింది

### సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని వినతి



ప్రదర్శనలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

కవిటి: సంవత్సరాల తరబడి మండల విద్యావనరుల కేంద్రంలో సేవలందిస్తున్న సమగ్రశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఉన్న తమ సర్వీసుల్ని క్రమబద్ధీకరించాలని ఆ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు కవిటి ఎంఈవో కార్యాలయం ఆవరణలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో డిమాండ్లతో కూడిన ప్లకార్డుల్ని ప్రదర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సర్వీసుల్ని క్రమబద్ధీకరించాన్నార. కార్యక్రమంలో కార్యాలయ కాంట్రాక్ట్ సిబ్బంది, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

### నేడు మందస మండల సమావేశం

మందస: మందస మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు మంగళవారం తెలిపారు. ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

### తక్షణ సాయం అందజేత



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: బొరిగిపేట గ్రామానికి చెందిన కొర్రాయి సుజాతకు వైఎస్సార్ బీమా కింద పది వేల రూపాయల తక్షణ సాయాన్ని మంగళవారం అందజేశారు. సుజాత భర్త ఇటీవల మృతి చెందడంతో ప్రభుత్వం బీమాను మంజూరు చేసింది. ఉప సర్పంచ్ డి.కామన్న, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు వసతి గృహ విద్యార్థులు ఎంపిక

టెక్కలి రూరల్: స్థానిక వంశధార కాలనీ సమీపంలోని ఎస్టీ బాలుర వసతి గృహానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగాలకు ఎంపికైనట్లు వార్డెన్ ఎస్.సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో జన్ని నిఖిల్, సవర ఉదయ్ కిరణ్‌తో పాటు మరో ఆరుగురు ఉన్నారన్నారు.

### మొక్కలు నాటిన చిరంజీవి అభిమానులు

ఇచ్ఛాపురం: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యులు పి.దేవేంద్రరెడ్డి, నర్సు శేషగిరి, చిరంజీవి అభిమానులు ఆలీమ్‌ఖాన్, అజయ్, దట్టి శ్రీను, విఘ్నేష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో రాష్ట్రం దివాలా

- వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పరుగులు
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- వెంకటాపురంలో పీహెచ్‌సీ భవనం ప్రారంభం



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు పాలనలో రాష్ట్రం తీవ్రంగా దివాలా తీసిందని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఎన్నికలు సమీపించే సరికి ప్రజలను ఉద్ధరిస్తానంటూ చంద్రబాబు మొసలి కన్నీరు కారుస్తున్నారని వ్యాఖ్యానించారు. వెంకటాపురం గ్రామంలో రూ. 1.78 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.27 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పక్కన పెట్టి రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం చేరువవుతోందన్నారు. రేగులపాడు-నువ్వలరేవు డబుల్ రోడ్డును రూ.16 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని.. అయితే పనులు కాస్తా ఆలస్యం కావడంతో ప్రతిపక్షంలోని చిల్లరగాళ్లు చిల్లర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంత సేపూ వాళ్లకి సొంత ఆస్తులు, ధనం కూడబెట్టుకోవడం తప్పా ప్రజలకు మేలు చేయడం తెలియదని విమర్శించారు. రోడ్డు పనులు పూర్తి చేసి వజ్రపుకొత్తూరు, పలాస మండలాలు కలుపుతూ ఇదే రహదారిపై పాదయాత్ర చేద్దామని పిలుపునిచ్చారు. ఇదే రోడ్డుపై వాళ్లను నడిపించి గతానికి, నేటికి తేడాను చూపిద్దామన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలు, పింఛన్‌దారులను గత టీడీపీ ప్రభుత్వం నమ్మించి మోసగించిందన్నారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి.. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే మహిళ సాధికారిత కోసం అమ్మఒడి, ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, రైతులకు రైతు భరోసా ఇచ్చి సంక్షేమ బాట పట్టించారన్నారు. పింఛన్‌దారులకు ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతి నుంచి మూడు వేల రూపాయల పింఛన్‌ను అందిస్తామన్నారు. అలాగే ఈ నవంబర్‌లో చేయూత ప్రథకం నాలుగో విడతగా అర్హత కలిగిన ప్రతి మహిళ ఖాతాలో రూ.18,750 జమ చేస్తామని చెప్పారు. చంద్రబాబు డ్వాక్రా, రైతు రుణమాఫీలు అటకెక్కించారని, సున్నా వడ్డీకి గుండు గీసాడని అన్నారు. సీఎం జగన్ మాట మీద నిలబడే వ్యక్తి అయితే, మాటపై నిలబడకపోవడం చంద్రబాబు నైజం అన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఆర్‌అండ్‌బీ డీఈలు ఎస్.రామినాయుడు, బి.సత్యాన్నారాయణ, ఏఈ విక్రమ్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, స్థానిక సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, ప్రణాళిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు హనుమంతు వెంకటరావు దొర, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఉరిటి ధమయంతి, కామేశ్వరరావు, పలాస ఎంపీపీ ఉంగ ప్రవీణ, పలాస మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీపీ సతీష్, వజ్రపుకొత్తూరు మండల కోఆప్షన్ సభ్యుడు మరడ భాస్కరరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, క్లస్టర్ ఇన్‌చార్జి దున్న బాలరాజు, ఉంద్రుకుడియా సర్పంచ్ కొర్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు చర్చిస్తున్న రైతు సంఘాల నాయకులు

మందస: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని చైతన్య, మహేంద్ర రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని గత ఏడాది నుంచి ప్రభుత్వ పెద్దలు, అధికారులను కోరుతున్నప్పటికీ న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కిలోల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. వరి పండించే రైతులకు కూడా ప్రభుత్వం ప్రకటించిన ధర సరిపోవడంలేదని, ధాన్యం అమ్మిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్వామినాథన్ కమిటీ ప్రకటించిన విధంగా ధరలు నిర్ణయించాలన్నారు. తిత్లీ తుఫాను నష్టపరిహారం అందని రైతులకు అందివ్వాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు మామిడి మాధవరావు, తామాడ త్రిలోచన, దాసరి శ్రీరాములు, గొర్లె చలపతిరావు, బెస్త కామేశ్వరరావు, నల్ల హడ్డి, మట్ట ఖగేశ్వరరావు, చిత్త గున్నయ్య, కొమర వాసు, తామాడ ముకుందరావు, కొర్ల హేమారావుచౌదరి పాల్గొన్నారు.

## 28న జీడిరైతుల మోటారు సైకిల్ యాత్ర



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

పలాస: జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ జీడి రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న మోటారు సైకిల్ యాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కంచిలి నుంచి పలాస వరకు చేపట్టనున్న మోటారు సైకిల్ యాత్రలో జీడి రైతులందరూ పాల్గొనాలని కోరారు. ఆర్బీకేల ద్వారా జీడి పిక్కలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని కోరారు. ఇందులో భాగంగా నాలుగు నెలలుగా లక్ష సంతకాల సేకరణ జరుగుతోందని చెప్పారు. ఇప్పటి వరకు 108 గ్రామాల్లో 82,500 సంతకాలు సేకరణ జరిగిందన్నారు. మోటారు సైకిల్ యాత్ర ముగిసిన తరువాత డిమాండ్లపై పలాస ఆర్డీవోకు వినతిపత్రం అందించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి తమ్మినాన భాస్కర్, అధ్యక్షుడు కొర్నాన బాలాజీ, రచయిత కుత్తుం వినోద్, కొర్ల హేమారావుచౌదరి, కోనేరు గురయ్య, కారి పురుషోత్తం, కుత్తుం డిల్లీరావు, దిలీప్ పాల్గొన్నారు.

## మొక్కలను పెంచాలి

సోంపేట:

పర్యావరణ పరిరక్షణకు ప్రతిపౌరుడు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. పలాసపురం పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. నాటిన మొక్కలను సంరక్షించాలని వేతనదారులకు సూచించారు. ఉపాధి టీఏ చిరంజీవులు, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్వరి, వేతనదారులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న జోగారావు

## ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి

మందస: ఆధార్‌కార్డులను ప్రతిఒక్కరూ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు సూచించారు. మండలంలోని పలు సచివాలయాల్లో ప్రారంభించిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ ఒక్కరూ ఆధార్‌కార్డులోని తప్పులు, చిరునామా (మారితే) సవరించుకోవాలన్నారు. అనంతరం హంసరాళి, కొంకడాపుట్టి, బొగాబందలలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను సందర్శించారు. బొగాబంద కాలనీలో విద్యుత్ సౌకర్యం లేదని గిరిజనులు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఏఈతో ఫోన్‌లో సమస్యను వివరించి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్ రౌతు జయలక్ష్మి, రౌతు దుర్యోధన, పంచాయతీ కార్యదర్శి జి.పద్మావతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్.గురుమూర్తి, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ పైల సతీష్‌కుమార్ ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి బూర్జపాడు, డొంకూరు, చిన్న లక్ష్మీపురం, శివకృష్ణాపురం, పెద్ద లక్ష్మీపురం గ్రామ పరిసరాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. ఆధార్‌కు మొబైల్ లింక్, ఆధార్ ఈ-మెయిల్ ఐడీ లింక్, పేరు, పుట్టిన తేదీ, చిరునామా మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, కొత్తగా ఆధార్ కార్డు నమోదు చేశారు. డిజిటల్ అసిస్టెంట్ దీపిక, మహిళా పోలీస్ రమ్య దీపికలు పాల్గొన్నారు.

## జిల్లా ఆస్పత్రికి వీల్‌చైర్లు వితరణ

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టారు ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రెండు వీల్ చైర్లను మంగళవారం వితరణగా అందజేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఆస్పత్రిలో రోగులకు సహాయార్థం వీల్ చైర్లను అందజేసినట్లు దాత తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, వైద్యులు మహారాజ్, శ్రీరాములు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆర్.రామచంద్రరావు, డి.వీరాస్వామి, డి.ఎ.స్టాలిన్, ఎ.చిట్టెన్న, కె.కామేశ్వరరావు, పి.హరిశ్చంద్రరావు పాల్గొన్నారు.



వీల్ చైర్లను అందజేస్తున్న దృశ్యం

### జగనన్న భూహక్కు పత్రాల పంపిణీ



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: రైతుల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు అన్నారు. విశ్వనాథపురం పంచాయతీ పరిధిలోని పలువురు రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. భూసర్వే ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రోణంకి మల్లయ్య, సర్పంచ్ పంకు ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి ఎన్.ఎన్. చైతన్య పాల్గొన్నారు.

### వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలి



బంతిపూల సాగును పరిశీలిస్తున్న హరికుమార్

కోటబొమ్మాళి: రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు తగు సస్యరక్షణ చర్యలు చేపడితే అధికదిగుబడులు సాధించవచ్చునన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన రైతు మేడిబోయిన నారాయణరావు తన రెండు ఎకరాల్లో పండిస్తున్న బంతి, చామంతి, జీడిమామిడి, మామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి ఉద్యానవనశాఖాధికారి కె.సునీత, సచివాలయం అగ్రికల్చరల్ అసిస్టెంటు హరిప్రియ పాల్గొన్నారు.

### ఒకే కాన్పులో రెండు దూడలు



తల్లిఆవు వద్ద రెండు దూడలు

సంతబొమ్మాళి: వడ్డితాండ్ర గ్రామానికి చెందిన రైతు కుత్తమ వరదరాజుకు చెందిన ఆవుకు ఒకే కాన్పులో రెండు మగ దూడలు మంగళవారం జన్మించాయి. మొదటి ఈతలో పుట్టిన దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.

### ఆక్రమణలను తొలగించాలని వినతి

ఇచ్ఛాపురం: కాలువలను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతుండడంతో మురుగునీరు వెళ్లే అవకాశం లేక ఇబ్బంది పడుతున్నామని ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 15 వార్డు ప్రజాప్రస్థాన విజయవాటిక సమీపంలో నివసించే ప్రజలు వాపోయారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్‌ను తన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

## సంక్షేమానికి చిరునామా సీఎం జగన్ పాలన

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- జె.మాణిక్యపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



దొలాయిసాయి గ్రామంలో దగ్ధమైన ఇళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయ

కంచిలి: సంక్షేమానికి చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిలిచిందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జలంత్రకోట సవాలయం పరిధి జె.మాణిక్యపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాలు, ప్రయోజనాలను వివరించారు. గత ప్రభుత్వానికి..ప్రస్తుత పాలనకు ఉన్న వ్యత్యాసాలను గమనించాలని ప్రజలను కోరారు. సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు ప్రకాశ్ చంద్రపండా, రమేష్‌గౌడో, లక్ష్మీబిసాయి, నెమలిపురి ఈశ్వరరావు, డొక్కరి హేమరాజు పాల్గొన్నారు.

**అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ**

సువాగడ పంచాయతీ పరిధి దొలాయిసాయి గ్రామ అగ్నిప్రమాద బాధితుల్ని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పరామర్శించారు. గ్రామవలంటీర్ రుషికేష్ భుయ్యా, మరో రెండు కుటుంబాలకు చెందిన పూరిళ్లు ఈ నెల 11వ తేదీన దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆమె బాధితులను పరామర్శించి ప్రమాదానికి కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి తహసీల్దార్ ఎస్.హైమావతికి ఫోన్‌చేసి ప్రభుత్వ సమకూర్చే తక్షణసాయం ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందించాలని, ఆయా కుటుంబాలకు ఇళ్ల నిర్మాణలకు పొజిషన్ సర్టిఫికెట్లను ఇచ్చి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటి సరఫరా

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. బెజ్జిపుట్టుగ పంచాయతీ పెద్దకర్రివానిపాలెం మత్స్యకార గ్రామంలో జల్‌జీవన్‌మిషన్ పథకంలో రూ.16.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. సాధ్యమైనంత త్వరగా పనుల్ని పూర్తి చేసి ఉద్దానం ప్రజలకు నీటిని అందించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య, సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి, ఇద్ది హనుమంత్, ప్రవీణ్, ధనంజయ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ పిరియా విజయ

## అర్హులందరికీ సంక్షేమం చేరువ

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి
- కస్తూరిపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరువ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. కస్తూరిపాడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వాణి కుమార్తె డాక్టర్ హైందవి తల్లికి తోడుగా వచ్చి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, సర్పంచ్‌లు గురువెల్లి గోవిందరావు, రాంపాత్రుని సావిత్రి, ఆర్.శివారెడ్డి, నూక సత్యరాజ్, సుంకరి జనార్దన, ఉర్జాన సురేష్, సనపల కృష్ణమూర్తి, ఎస్.వి.రమణ, అక్కురాడ సురేష్, తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు చుక్క లోకేష్, బగాది దివాకర్, పూజారి సత్యం, జేసీఎస్ కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, సింగూరు నారాయణరావు, దుంపల మురళి పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

టెక్కలి రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నందిగాం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ అన్నారు. ఇందుకు ఇంటర్మీడియెట్ విద్య కీలకమని చెప్పారు. కళాశాలలో ఫ్రెషర్స్ డేను మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంటర్మీడియెట్ నుంచే కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.



సినీగేయాలకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

## 'జాలిలేని బొమ్మ' పాట చిత్రీకరణ

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం ప్రాంతానికి చెందిన యువకులు వివిధ రంగాల్లో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. కొంతమంది షార్ట్‌ఫిల్ములు తీస్తున్నారు. తమ ప్రతిభ, కళానైపుణ్యంతో సోషల్ మీడియా వేదికగా సత్తాను చాటుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమలో ఓడిన ఓ ప్రేమికుడి ఇతివృత్తాంతాన్ని చేసుకొని 'జాలిలేని బొమ్మ' పాటను ఈ ప్రాంతీయులు చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా పలు సన్నివేశాలను ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా, ఉద్దాన ప్రాంతాలో చిత్రీకరించారు. పాటకు సంబంధించిన ప్రోమోను ఈ నెల 24వ తేదీన విడుదల చేయనున్నట్లు యూనిట్ బృంద సభ్యులు మంగళవారం తెలిపారు. నటీనటులుగా పూజా, అరవింద్ నటిస్తుండగా, డైరెక్టర్‌గా సురేష్ సూర్యా వ్యవహరించారు. పాటను హుస్సేన్ రచించారు.



పాటలోని ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

## మంత్రి అప్పలరాజును కలిసిన కొమ్మినేని..

కాశీబుగ్గ: రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పలాసలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఓ మొక్కను అందజేశారు. ఉద్దాన ప్రాంత్రంలో కిడ్నీ మహమ్మారి విరుచుకు పడుతుంటే పలువురు ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటే.. మరికొందరు రెచ్చగొట్టి వదిలేశారన్నారు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే పనులు చేసి చూపించారన్నారు. ఉద్దానం స్థితిగతులపై రాయాల్సిన కథనాలు, వ్యాసాలపై మంత్రితో కొమ్మినేని చర్చించారు.



మంత్రి అప్పలరాజుకు మొక్కను అందజేస్తున్న కొమ్మినేని

## కల్వర్టు పనులకు శంకుస్థాపన

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 16వ వార్డు శ్రీనివాసనగర్ మేధా డిగ్రీ కళాశాల సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో కల్వర్టును నిర్మించనున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మార్పు యుగంధర్, పీసీఎంఏ కార్యదర్శి కేవీ శివకృష్ణ, పెచ్చెట్టి సూరారావు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న గిరిబాబు